జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 20-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 620 పేజీలు: 4 వెల : రూ.7

# జిల్లా సమగ్రాభివృద్ధికి.. సమష్టి కృషి





*** కొత్త సంవత్సరంలో కొత్త వెలుగులు రావాలి * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * పంచాంగ శ్రవణంలో జిల్లా అధికారులు * ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

**శ్రీకాకుళం, మార్చి 19(వార్త):** పరాభవ నామ సంవత్సరంలో జిల్లా సమగ్ర అభ్యున్నతికి సమష్టిగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు శ్రీకాకుళం నగరంలోని డా.బి.ఆర్.అంబేద్కర్ కళావేదికలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, అధికారులు, శాసన సభ్యులు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చెందే విధంగా ప్రణాళికతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తెలుగు ప్రజలకు ఉగాది పండుగ ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఉగాది పచ్చడిలో ఆరు రుచులు ఎలా ఉంటాయో కష్టసుఖాలను అధిగమించి సానుకూల దృక్పథంతో ముందడుగు వేయాలని కోరారు. అందరి జీవితాల్లో పరాభనామ సంవత్సరం కొత్త వెలుగులు తీసుకురావాలని అన్నారు. జిల్లా మంత్రుల తోడ్పాటుతో జిల్లా సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనించాలని పేర్కొన్నారు. శాసన సభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలు ఆయురారోగ్యంతో అభివృద్ధి ఫలాలు అందుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్‌తో సహా అధికారులు సాంప్రదాయ వస్త్రాలను ధరించి వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంగళ వాయిద్యాల మధ్య జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. వేద పండితులు వేదమంత్రాలతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేను ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వేదపండితులను దుశ్శాలువతో సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. శివశ్రీ నృత్య కళానికేతన్ శ్రీకాంత్ రఘుపత్రుని కళా బృందం ప్రదర్శించిన కూచిపూడి, కోలాటం, ఏకపాత్రాభినయం నృత్యాలు ఆహుతులను అలరించాయి. ప్రఖ్యాత కవులు ఆలపించిన కవితలు అందరినీ ఆకట్టుకున్నాయి. దైవజ్ఞ ధర్మపురి గౌరీ శంకర్ శాస్త్రీ పంచాంగ శ్రవణం చేశారు. ఈ ఏడాది రాశి ఫలితాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కలెక్టర్ దొనక పృథ్వీ రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణరావు, జిల్లా విద్యా శాఖాధికారి రవి బాబు, జిల్లా ఉద్యాన వన శాఖ సహాయ సంచాలకులు వర ప్రసాద్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవ రావు, శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవో లు సాయి ప్రత్యూష, ఎమ్.కృష్ణ మూర్తి, పర్యాటక శాఖ అధికారి పి.నారాయణ రావు, దేవాదాయ శాఖ కార్యాహక అధికారి ప్రసాదరావు, తహసీల్దార్ గణపతి, కవులు, కళాభిమానులు పాల్గొన్నారు.

## అరసవల్లి దేవస్థానంలో సామూహిక అక్షరాభ్యాసాలు

పరాభవ నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో చిన్నారులకు ఉచిత సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ, ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణల మధ్య చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు.



# రూ.4కోట్లతో అరసవల్లిలో.. ఇంద్రపుష్కరిణి అభివృద్ధికి శ్రీకారం

*** ఈనెల 21న శంకుస్థాపన చేయనున్న మంత్రి అచ్చెన్నాయుడు * మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేసిన ఈవో**



**శ్రీకాకుళం, మార్చి 19 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇంద్ర పుష్కరిణి ఆధునీకరణ పనులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో ఈ పనులకు రూ.4 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 21 ఇంద్ర పుష్కరిణి ఆధునీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఇంద్ర పుష్కరిణి అభివృద్ధికి గత ప్రభుత్వం నిధులు ఇస్తామని చెప్పినప్పటికీ సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు చేపట్టలేదు. చుట్టూ ఉన్న మెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇంద్ర పుష్కరిణికి నీరు అందించే ప్రధాన కాలువలు మూతపడ్డాయి. ఈ పనులన్నింటిని చేపట్టకపోవడం వల్ల అంతర్భాగంలో మట్టి పూడుకుపోయింది. ఈ పనులన్నింటినీ ఇప్పుడు చేపట్టనున్నారు. ఇప్పటికే శంకుస్థాపనకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం నిమ్మాడ మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఈవో కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్, సిబ్బంది మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

# అకాల వర్షాలపై.. అప్రమత్తంగా ఉండాలి

*** రైతులకు పూర్తి సహాయం అందిస్తాం * మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * ఉన్నత అధికారులతో సమీక్ష**



**శ్రీకాకుళం, మార్చి 19(వార్త):** రాష్ట్రంలో రాబోయే మూడు నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం అత్యవసర సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఇంచార్జ్ కమిషనర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం/ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని, ముఖ్యంగా రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర జిల్లాల్లో తీవ్ర ప్రభావం ఉండే అవకాశముందని మంత్రి తెలిపారు. అరటి, మామిడి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను త్వరితగతిన గుర్తించి, నష్టాన్ని నమోదు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

# సిలిండర్ కోసం.. పడిగాపులు!

*** బుకింగ్ చేసినా గ్యాస్ రావడం లేదని వినియోగదారుల ఆగ్రహం * గొడౌన్ ముందు బండలతో వినియోగదారుల బారులు * బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందన్న అనుమానాలు**



**పలాస, మార్చి 19 (వార్త):** పలాసలో వంట గ్యాస్ తీవ్ర కొరత ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. 10 నుంచి 20 రోజుల ముందుగానే గ్యాస్ బుకింగ్ చేసినప్పటికీ సరఫరా జరగడం లేదని వినియోగదారులు మండిపడుతున్నారు. పలాసలోని భారత్ గ్యాస్ గొడౌన్ వద్ద సిలిండర్ల కోసం తెల్లవారుజామునుంచే వినియోగదారులు బారులుదీరుతున్నారు. లారీ ద్వారా గ్యాస్ లోడ్ వచ్చిందనే సమాచారం తెలుసుకుని వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు చెందిన ప్రజలు బైక్‌లు, ఆటోలపై ఖాళీ సిలిండర్లు, బుకింగ్ పుస్తకాలతో గొడౌన్ వద్దకు చేరుకుంటున్నారు. గంటల తరబడి నిరీక్షించినా గ్యాస్ అందక నిరాశతో తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. నువ్వలరేవు, చిన వంక, బాతుపురం, అక్కుపల్లి, మెట్టూరు, గుణుపల్లి, హరిపురం, అంబుగాం, రట్టి, భేతాళపురం వంటి గ్రామాల నుంచి వచ్చిన వినియోగదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరఫరా వాహనాలు గ్రామాలకు రాకపోవడంతో ఖర్చు పెట్టి పలాసకు రావాల్సి వస్తోందని, ఇక్కడ కూడా 'స్టాక్ లేదు' అంటూ గొడౌన్ సిబ్బంది, డెలివరీ బాయ్స్ చెబుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్ ద్వారా హోటళ్లకు మళ్లిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్యాస్ కొరతను నివారించాలని, వినియోగదారులకు సమయానికి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఘనంగా హరేకృష్ణ నామ సంకీర్తన

**నరసన్నపేట, మార్చి 19(వార్త):** నరసన్నపేటలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న కళాసి యూనియన్ ఆధ్వర్యంలో హరే కృష్ణ నామ సంకీర్తన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా నిర్వాహకులు పొట్నూరు సాయి బాబా మాట్లాడుతూ, గత 30 రోజులుగా స్థానిక కార్మికులతో కలిసి నిరంతరంగా హరే కృష్ణ నామ సంకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని మరింత భక్తి భావంతో నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు హరేకృష్ణ నామాన్ని జపిస్తూ ఆధ్యా త్మిక వాతావరణాన్ని సృష్టించారు.

ఈ కార్యక్రమం సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డా రు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు, కార్మికుల, భక్తులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.



# పండగ పూట విషాదం

### -ఇసుక ట్రాక్టర్ ఢీకొని

### యువకుడి దుర్మరణం



**ఇచ్ఛాపురం, మార్చి 19(వార్త):** ఇచ్ఛాపురం బెల్లుపడ రోడ్డులోని జామి ఎల్లమ్మ గుడి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లు పడకొండ వీధికి చెందిన ఉప్పాడ కుమార్ (22) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఆయన బెల్లు పడ నుంచి సురంగి రాజా మైదానం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఇసుకలోడుతో అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ట్రాక్టర్ ట్రక్కు మధ్యలో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ఇటీవలే విదేశాల్లో పని చేసి స్వగ్రామానికి వచ్చాడు. తండ్రి త్రినాధ్ కళాసీగా పని చేస్తున్నారు. కుమారుడు దుర్మరణం చెందడంతో ఆ తల్లిదండ్రు లు భోరున విలపిస్తున్నారు. ఉగాది రోజున జరిగిన సంఘటనతో బెల్లుపడాలో విషాద ఛాయలు అలు ముకున్నాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరు కున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రత్తకన్న సామాజిక భవనానికి విద్యుత్ సౌకర్యం



**ఇచ్ఛాపురం మార్చి 19 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి రత్తకన్న 20వ వార్డులో హరేరామ హరేకృష్ణ నామ సంకీర్తన భజగోవిందం సామాజిక పూజా నివాసానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. దీనిని వార్డు తెలుగు దేశం ఇన్‌చార్జి సుభాష్‌రౌలో గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో భజగోవిందం భక్తులు పాల్గొన్నారు.

# అన్నదాత కుటుంబానికి అండగా..!

**-అప్పుల బాధతో గత ఏప్రిల్‌లో ఓ రైతన్న ఆత్మహత్య**
**-బాధిత కుటుంబాన్న ఆదుకోని ప్రభుత్వం**
**-ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న పరిహారం ఫైల్**
**-మేమున్నామని ముందుకొచ్చిన రైతు స్వరాజ్య వేదిక**
**-బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థికసాయం**



**కంచిలి, మార్చి 19(వార్త):** అప్పుల బాధ్య తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న ఓ అన్నదాత కుటుంబానికి రైతు స్వరాజ్య వేదిక అండగా నిలిచింది. తమ వంతుగా ఆర్థికసాయం అందిచించి. ప్రభుత్వం పట్టించుకోకున్నా మేమున్నామని వారికి భరోసా కల్పించింది.

కంచిలి మండలం పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన రైతు బల్లెడ నరసింహమూర్తి గత ఏప్రిల్‌లో అప్పుల బాధను భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. ఓ సామాన్య రైతు సాగు భూములను పలువురు నుంచి కౌలుకు తీసుకొని ముందుగా వారికి చెల్లించేందుకు, అలాగే కుటుంబ అవసరాలకు అప్పులు చేసి వాతావరణం సహకరించక పంటలపై తెగుళ్లు విజృంభించి దిగుబడిలో లేక పరిస్థితులు దిగజారి అప్పులతో సతమతమై ఆందోళనతో ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. ఈ నేపథ్యంలో నరసింహమూర్తి మరణంపై పోలీసులు కేసు నమోదు చేసి, వారి దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వాస్తవ విషయాలను పరిగణనలోకి తీసుకొని నరసింహ మూర్తి అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ఇటువంటి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా సహాయం అందించి ఆసరా కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందుకు సంబంధించిన ఫైల్ కూడా ప్రభుత్వానికి ఏడాది క్రితమే చేరింది. పోలీస్ కేసులో పేర్కొన్న అంశాలను స్థానిక తహసీల్దార్, డివిజనల్ పోలీస్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి నిర్ధారించి ఆ ఫైలును జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి సమర్పించినప్పటికీ సదరు కుటుంబానికి సహాయం మాత్రం ఇంకా అందకపోవడం గమనార్హం. ఈ విషయంలో రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు ఈ ఆత్మహత్య సంఘటనకు సంబంధించి క్షేత్రస్థాయిలో వివిధ వర్గాలతో మాట్లాడి నిజ నిర్ధారణ చేసుకుంటూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతు సమస్యలపై పోరాడుతున్న రైతు స్వరాజ్య వేదికకు నివేదించారు. సదర సంస్థ ప్రతినిధులు కూడా మానవ హక్కుల వేదిక ప్రతినిధులైన వీఎస్ కృష్ణ తదితరులతో కూడిన బృందం పెద్దకొజ్జిరియా గ్రామాన్ని గత ఏడాది సందర్శించి బాధిత కుటుంబీకులతో పలు విషయాలను మాట్లాడారు. తమ వైపు నుంచి కూడా ప్రభుత్వానికి లేఖ రాసి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా ప్రభుత్వానికి వెళ్లాల్సిన ఫైల్ పరిశీలించిన పలాస ఆర్డీవో కూడా ప్రభుత్వం నుంచి తప్పకుండా సహాయం అందుతుందని బాధిత కుటుంబానికి తెలిపారు. పలు విధాలుగా ప్రయత్నాలు జరిగిన సహాయం మాత్రం ఇప్పటికి అందకపోవడంతో బాధిత కుటుంబం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.

### రైతు స్వరాజ్య వేదిక సాయం

తెలుగు రాష్ట్రాల్లో రైతు సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న రైతు స్వరాజ్య వేదిక రాష్ట్రంలో ఆత్మ హత్యలకు పాల్పడిన రైతులను వారి కుటుంబాలను గుర్తించి రెండు రోజుల క్రితం విజయవాడ వేదికగా ఆర్థికసాయాన్ని అందజేశారు. అందులో భాగంగా పెద్ద కొజ్జిరియాలో ఆత్మహత్య చేసుకున్న నరసింహ మూర్తి భార్య నీలవేణికి కూడా రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సాయం రాష్ట్ర బీసీ సంఘం ప్రతినిధి బీన ఢిల్లీరావు రైతు స్వరాజ్య వేదిక సేవలను ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబం కూడా ఈ సాయంపై దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకండి

### - కాశీబుగ్గ ఎస్ఐ నరసింహమూర్తి

**పలాస, మార్చి 19 (వార్త):** సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోకండని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నర సింహ మూర్తి హెచ్చరించారు. గురువారం గరుడఖండిలో పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. నారీ శక్తి నుంచి సైబర్ ముప్పుల వరకూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. సమాజాన్ని కలవరపెడుతున్న కీలక అంశాలపై పోలీసులు వివరించారు. నారీ శక్తి సాధికారత నుంచి సైబర్ క్రైమ్ ముప్పులు, బాల్య వివాహాల దుష్పరిణామాలు, యువతలో సంకల్పం అవసరం, మైనర్ డ్రైవింగ్ ప్రమాదాల వరకు విస్తృత అంశాలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. మహిళల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోవాలన్నారు.




బాల్య వివాహాలు బాలల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తాయని హెచ్చరిస్తూ, చట్టపరమైన చర్యల గురించి వివరించారు. అదే సమయంలో యువతలో సంకల్పం, లక్ష్యసాధనపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు, ప్రాణనష్టం గురించి ఉదాహరణలతో వివరించి, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామస్థులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించడం విశేషం. సమాజంలో మార్పు తీసుకురావాలంటే ఇటువంటి అవగాహన కార్యక్రమాలునిరంతరంజరగాలని వారు అభిప్రాయపడ్డారు.

# వైస్సార్సీపీ అధినేత జగన్‌తో డాక్టర్ రాము భేటీ



**ఇచ్ఛాపురం-సోంపేట, మార్చి 19 (వార్త):** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, మహాలక్ష్మి హాస్పిటల్ అధినేత, వైసీపీ నాయకుడు డాక్టర్ ఉలాల కోదండరామ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉగాది రోజున జరిగిన ఈ భేటీ రాజకీయ ప్రాధాన్యత సంతరించు కుంది. విజ యవాడ సమీప తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జగన్ మోహన్ రెడ్డిని కలిసిన డాక్టర్ కోదండరామ్ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి వివరించారు. జగన్ ఈ విషయా లను ఆసక్తిగా విన్నట్లు సమాచారం. త్వరలో స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జగన్ మోహన్ రెడ్డితో డాక్టర్ ఉలాల కోదండరామ్ భేటీ అవడం గమనార్హం. దీంతో ఒక్కసారిగా వైస్సార్సీపీలో పొలిటికల్ హీట్ పెరిగింది.

## ఆర్.బెలగాంలో కోలాటం గజ్జెల పూజ



**ఇచ్ఛాపురం మార్చి 19 (వార్త):** ఆర్.బెలగాంలో గురువారం ఘనంగా కోలాటం గజ్జెల పూజ నిర్వహించారు. కాశీ విశ్వనాథ ఆలయ ప్రాంగణంలో ప్రముఖ జానపద గురువు టి.బరంపురం వాసి తెప్పన ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 మంది మహిళలతో కోలాట శిక్షణ ఇస్తూ, కోలాటం సభ్యులతో సామూహికంగా భక్తిశ్రద్ధలతో గజ్జల పూజ నిర్వహించి గజ్జెల వితరణ చేపట్టారు. కార్యక్రమంలో గురువు తిప్పన ధనంజయ రెడ్డి, గ్రామ పెద్దలు, కోలాట బృందాల ఆర్గనైజర్లు, కోలాట బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాటమ్మ తల్లి వార్షికోత్సవాలు

**పలాస, మార్చి 19 (వార్త):** బ్రాహ్మణతర్ల గ్రామంలో ఉగాది పర్వదినాన కాటమ్మ తల్లి 44వ వార్షికోత్సవాలు ఘనంగా గురువారం నిర్వహించారు. కాటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు యావన్మందీ తమ కోర్కెలు తీర్చే కల్పతరువుగా వాసుకెక్కిన అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కాటమ్మ తల్లికి ప్రీతి పాత్రమైన పసుపు..కుంకుమలతో పాటు ముగ్రాట, ధూప దీప నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయానికి వచ్చిన భక్తులకు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు. కాటమ్మ తల్లి గుడి ఆవరణలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు వడ్డీ యాదగిరి, పలాస యూనిట్ కోకన్వీనర్ ఆళ్ల కృష్ణారావు, ఎస్ఎంసీ చైర్మన్ తామడ మోహనరావు, అమలుకుడియా నీటి సంఘం ఉపాధ్యక్షుడు సల్ల విశ్వనాథం, ఎస్ఎంసీ చైర్మన్ ఆళ్ల సోమేశ్వరరావు, ఆళ్ల వెంకటరావు, గరికి కృష్ణారావు, కొవ్వూరు ధర్మరావు, శాసనపురి వెంకటరావు, కోరాడ జోగారావు, ఎండ్ల పాపారావు, పెంటమని శీను, బమ్మిడి పాపారావు, టైలర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.





# వసంత నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

### - భక్తిశ్రద్ధలతో పందిరిరాట కార్యక్రమం

**నరసన్నపేట, మార్చి 19(వార్త):** నరసన్నపేట జట్టు కళాసీ యూని యన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాలు గురువా రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద వేద పండితులు వనమాలి కామేశ్వర శర్మ ఆధ్వ ర్యంలో భక్తిశ్రద్ధలతో పందిరి రాట (శుభ రాట) కార్యక్రమాన్ని నిర్వహిం చారు. యూనియన్ అధ్యక్షుడు నేతింటి జనార్ధనరావు సమక్షంలో ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 28వరకు కొనసాగనున్నాయి. ప్రసన్నాంజనేయ స్వామి ఆవరణలో ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యా త్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతను బలపరుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మాజీ మంత్రి అప్పలరాజుకు వైసీపీ నేతల ఉగాది శుభాకాంక్షలు

**పలాస, మార్చి 19 (వార్త):** ఉగాది పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని పలాసలోని ప్రజా సదన్‌లో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలాస పట్టణ వైసీపీ అధ్యక్షుడు శిష్టు గోపి, పైల వెంకట రమణ (చిట్టి), ఉంగ సాయికృష్ణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసి ఆయనకు మొక్కలు అందజేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పరాభావ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖ శాంతులు నెలకొని, ప్రతి కుటుంబం ఆనందంతో ఉండాలని సీదిరి అప్పలరాజు ఆకాంక్షించారు. ఈ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, ఉగాది పర్వదినం ప్రతి ఒక్కరికీ కొత్త ఆశలు, కొత్త అవకాశాలు తీసుకురావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



## బ్రాహ్మణతర్ల బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం



**పలాస, మార్చి 19 (వార్త):** పలాస మండలం బ్రాహ్మణతర్ల బస్టాండ్ ఆవరణలో ఉగాది పర్వదినాన టీడీపీ నాయకులు సల్ల విశ్వనాథం, కాంతమ్మ దంపతులు సొంత నిధులతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులు, పాదచారులకు తాగునీరు అందులో ఉంచాలనే ఉద్దేశ్యంతో చలి వేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతిరోజూ తాగునీరు కుండలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్డీ యాదగిరి, ఆళ్ల కృష్ణారావు, ఆళ్ల వెంకట్రావు, వూన జోగారావు, ఆళ్ల సోమేశ్వరరావు, పాపారావు, తామడ మోహనరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ సింహం.. 'సోములయ్య'




**మందస, మార్చి 19(వార్త):** సాహితీరంగంలో విశేష సేవలందించిన సవర సోములయ్యకు సాహితీ సింహం బిరుదు వరించింది. మందస మండలంలోని కిల్లోయి కాలనీకి చెందిన సోములయ్య ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. జన జాగృతి సాహితీ సాంస్కృతిక సమైక్య(పలాస- కాశీబుగ్గ) 81వ కార్యక్రమంలో దశమ వార్షికోత్సవం, శ్రీ పరాభవనామ సంవత్సరం ఉగాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన, ఉత్తరాంధ్ర స్థాయి కవి సమ్మేళనంలో సోములయ్యను ఈ బిరుదుతో సత్కరించారు. యువత డి.కె.లా సాంస్కృతిలో అనే కవితను స్వీయ రచన చేసి గానం చేసినందుకు సాహితీ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు లయన్ డాక్టర్ క్రిష్ణమూర్తి, జానపద కళాకారుడు కుమార్ నాయక్ తదితరులు ఆయనకు ప్రశంసాపత్రము అందించారు. అనంతరం దుశ్శాలువను కప్పి, సత్కరించారు. కాశీబుగ్గలోని గురుకుల విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సాహితీ సింహం బిరుదు పొందడంతో గిరిజనులు, ప్రజలు ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఐఐటీలో డిగ్రీ విద్యార్థుల సత్తా



**ఇచ్ఛాపురం మార్చి 19 (వార్త):** ఐఐటీ జాయింట్ ఎంట్రన్స్ ఫర్ మాస్టర్స్ పరీక్షలో రత్తకన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ధనేశ్వర్ బెహరా 908, కే.రేణుకా 2380, పి.పవన్ 4640, కేసాబ్ బెహరా 5697 ర్యాంకులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, లెక్చరర్లు దుర్యోధన శివకుమార్, సీతమ్మ, సంతోష్, ఈశ్వర్, రాధాచ లోకేశ్, దేవ రాజ్, బృందావనం అభినందించారు.

## కవి 'మార్పు'నకు సాహితీ సింహ బిరుదు



**మందస, మార్చి 19(వార్త):** జాతీయ అబ్దుల్ కలామ్ సేవారత్న పురస్కార గ్రహీత, కవితాశిరోమణి బిరుదాంకితుడు మార్పు జగన్మోహనరావుకు సాహితీ సింహ బిరుదు దక్కింది. మందస మండలంలోని బిన్నళమదనాపురం గ్రామానికి చెందిన మార్పు జగన్మోహనరావు ఇదే మండలంలోని అంబుగాం పంచాయతీ లింబుగాంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. జనజాగృతి సాంస్కృతిక సమాఖ్య (పలాస-కాశీబుగ్గ) 10వ వార్షికోత్సవం, శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది ఉత్సవం-2026 81వ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కుమార్ నాయక్(అధ్యక్షుడు, జన జాగృతి),లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి(వ్యవస్థాపక అధ్యక్షుడు, జనజాగృతి) జాతీయ అబ్దుల్ కలామ్ సేవారత్న పురస్కార గ్రహీత, కవితాశిరోమణి బిరుదాంకితుడు మార్పు జగన్మోహనరావుకు సాహితీ సింహ బిరుదును ఇచ్చి సత్కరించి, గౌరవించారు. ఈసందర్భంగా జగన్మోహనరావుకు పలువురు అభినందనలు తెలిపారు.

### -నరసన్నపేట సీతారామ మందిరంలో ఘనంగా ఉగాది ఉత్సవాల నిర్వహణ

### - పంచలోహ మకర తోరణం ఏర్పాటు

### -నవమి వరకు ఉత్సవాల కొనసాగింపు

**నరసన్నపేట, మార్చి 19(వార్త):** నరసన్నపేట పురుషోత్తం నగర్, రాజీవ్ నగర్ కాలనీలోని సీతారామ మందిరంలో ఉగాది ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు పతివాడ గిరీశ్వరరావు మాట్లాడుతూ, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రారంభమైన ఈ ఉత్సవాలు నవమి వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. భక్తుల సహకారంతో స్వామివారికి పంచలోహ మకర తోరణం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వనమాలి బాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని పూజల్లో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఈ ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించడంతో పాటు ప్రాంతంలో భక్తి భావాన్ని పెంపొందిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు.



# ఊరూరా... ఉగాది

### -పల్లెల్లో వైభవంగా వేడుకలు- పెల్లుబికిన ఆధ్యాత్మికత - షడ్రుచుల పచ్చడితో విందు

- ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు
- పంచాంగ శ్రవణం
- నూతన సంవత్సర ఫలితాలపై ప్రజలకు అవగాహన



**సారవకోట, మార్చి 19 (వార్త):** సారవకోట మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలుదు కోదండ రామాలయం, చీడిపూడి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, సారవకోట గ్రామంలోని ఉమా త్రైలోకేశ్వర స్వామి ఆలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరానికి సంబంధించిన ఫలితాలను వివరించారు. పంచాంగ శ్రవణం ద్వారా ఈ ఏడాది వర్షపాతం, పంటల పరిస్థితులు, శుభాశుభ ఫలితాల గురించి ప్రజలు తెలుసుకున్నారు. గ్రామస్థులు ఆసక్తిగా పాల్గొని పండితుల వివరణలను శ్రద్ధగా విన్నారు. ఈ కార్యక్రమాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రజలకు కొత్త సంవత్సరంపై అవగాహన కల్పిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

### శివానందగిరిపై ..



**ఇచ్ఛాపురం మార్చి 19 (వార్త):** బెల్లుపడా శివానందగిరిపై ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్రినాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాంప్రసాద్ మాస్టర్ ఉగాది పంచాంగ శ్రవణం వినిపించారు. 101 జంటలు సామూహిక పూజల్లో పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### జ్ఞానభారతిలో

ఇచ్ఛాపురంలోని జ్ఞానభారతి పాఠశాలలో ఉగాది వేడుకలు పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, తెన్నేటి తేజస్విర శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కవి సమ్మేళనంలో కవులు పండి డిల్లేశ్వరరావు, ఎం ఎస్ వి గంగరాజు, బండారు దుర్గాప్రసాద్, రావి జయ కృష్ణ అద్భుతమైన కవితలు వినిపించి ఆహుతలను అలరించారు. ఈ సందర్భంగా కవులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయవాది ఎస్ విశ్వనాధ్, హిందీ పండితులు ఎల్ చిరంజీవి రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీం ఖాన్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, పిఈటి కైలాస్‌కుమార్ పండా, డి రాము తదితరులు పాల్గొన్నారు.






### జాగృతి సౌజన్యంతో ..

**పలాస, మార్చి 19 (వార్త):** జన జాగృతి సాహితి సాంస్కృతిక వేదిక సౌజన్యతో కాశీబుగ్గ గురుకుల విద్యాలయంలో ఉగాది వేడుకలు జాగృతి అధ్యక్షులు డాక్టర్. కుమార్ నాయక్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన కుమార్ నాయక్ మాట్లాడుతూ సమాజానికి దిశా దశ నిర్దేశించేది సాహిత్యమని సాహిత్యాన్ని, సాహితీవేత్తలను కాపాడుకోవలసిన బాధ్యత మన అందరి మీద ఉందని అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బట్టా నాగేశ్వరరావు జిల్లా విశ్రాంత రిజిస్టర్ మాట్లాడుతూ సమకాలీన పరిస్థితులలో సాహిత్యాన్ని భద్రపరచాలని కోరారు. వ్యవస్థాపక అధ్యక్షులు టి.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆహ్వానిత కవులకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ, కవులకు సత్కరించడం మా అదృష్టంగా తెలిపారు. పరాభవ నామ సంవత్సరశీపై పలువురు కవులు తమ కవితలను చమత్కరిస్తూ వివరించారు. బచ్చల జోషిత ,మల్లవరపు యశస్విని, తను శ్రీ శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి. తులసి యోగేంద్ర మాస్టర్ గారి పంచాంగ శ్రవణం, బమ్మిడి సుబ్బారావు వ్యాఖ్యానముతో ప్రారంభమై బచ్చల బాలరాజు వందన సమర్పణతో ముగిసింది. ఈ సందర్భంగా 63 మంది కవులకు సత్కరిస్తూ "సాహితీ సింహ" బిరుదులు ప్రధానం చేస్తూ, ఫలం, పుష్పం, తోయం, పుస్తకం, కలం ,సాలువ, పగిడి ప్రశంసా పత్రంతో కవులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బండారి కాళిదాసు, ఉపాధ్యక్షులు శ్రీనివాస బాబ్జి, గౌరవ అధ్యక్షులు వెంకటాచలం, గణిత అవధాని మద్దు తిరుపతిరావు, లండ రుద్ర మూర్తి, టి బాబురావు మాస్టర్, మద్దు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# బడులను కాపాడుకుందాం

### -బడిబాటను జయప్రదం చేయండి

### -యూటీఎఫ్ పిలుపు

**మందస, మార్చి 19(వార్త):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా యూటీఎఫ్ చేపట్టే బడిబాట ఆటో జాత కార్యక్రమాన్ని మందస మండలంలో విజయవంతం చేయాలని ఆ సంఘ మందస మండల శాఖ పిలుపునిచ్చింది. మందస లో గురువారం మండల శాఖ అధ్యక్షుడు జగదీష్ బడిత్య అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జయరాం మాలి, పూర్వపు కార్యదర్శి గున్న రమేష్, మండల ప్రధాన కార్య దర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాగించాలంటే విద్యార్థుల నమోదు పెరగాలని, ప్రతీ ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించి ఊరు బడిని కాపాడుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు ఉన్నాయని, వీటిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆటో జాత నిర్వహించి గ్రామాల వారీగా పర్యటించి, బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తీర్మానించారు. ప్రభుత్వ పాఠశాలలు కేవలం విద్యా కేంద్రాలు మాత్రమే కాదు.. అవి మన గ్రామ సంపద. బడిబాట ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల ప్రాముఖ్యతను వివరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూటీఎఫ్ పూర్వపు జిల్లా కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు కోశాధికారి సోమనాథ్ శిష్టు, మండల పూర్వపు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిన్నింటి కొండలరావు, కొర్ల సోమేశ్వర రావు, జిల్లా కౌన్సిలర్ తరణి సోమేశ్వరరావు, మండల అకాడమిక్ సెల్ కన్వీనర్ సారి ప్రేమ్‌కుమార్, కంసు ఖగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546